క్లుప్తంగా

నియామకం


రాంచందర్

మహబూబాబాద్ రూరల్ : లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శిగా రేగడి తండా గ్రామానికి చెందిన గుగులోత్ రాంచందర్ నాయక్‌ను నియమించారు. ఈమేరకు ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హరి నాయక్, రాష్ట్ర కో కన్వీనర్ (ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్) గుగులోతు భీమా నాయక్ శుక్రవారం నియమించినట్లు తెలిపారు.

టీఎస్‌టీటీఎఫ్ జిల్లా కమిటీ..


భద్రునాయక్


భాస్కర్‌నాయక్

బయ్యారం /గార్ల : తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా ఎం.భద్రునాయక్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా జి.భాస్కర్‌నాయక్, గౌరవ అధ్యక్షుడిగా ధర్మ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిచ్చ నాయక్, ఉపాధ్యక్షుడిగా రవీందర్ నాయక్, కోశాధికారిగా బాలాజీ తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.సమావేశంలో టీటీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివ, బానోత్ పాపాలాల్, తదితరులు పాల్గొన్నారు.

భద్రతా చర్యలు చేపట్టాలి



డోర్నకల్ : ఆలయాలు, మసీదులు, చర్చిలలో దొంగతనాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆలయాలు, మసీదు కమిటీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఆలయాలు, మసీదుల వద్ద దొంగతనాల నివారణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలని కోరారు.

'విచారణ చేయించాలి'

డోర్నకల్ : డోర్నకల్ మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగంపై అధికారులు సమగ్ర విచారణ చేయించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగం, దారిమళ్లింపుపై పాలకవర్గ పార్టీ సభ్యులే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. గతంలో మున్సిపాలిటీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేసి కేసులు పెట్టారని పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగం, అవినీతిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సుమేర్‌చంద్‌జైన్ తెలిపారు. సమావేశంలో హరికృష్ణ, రెడ్డెబోయిన భాస్కర్, మున్నా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు



గార్ల : బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పుల్లూరు, పెద్ద కిష్టాపురం గ్రామాల ఎంపీటీసీలు మంజుల, ఆలోత్ పరేంగస్ శుక్రవారం గార్లలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి మాలోత్ సురేష్ సైతం ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు.

ఎమ్మెల్యేకు వినతి

బయ్యారం : గ్రామాభివృద్ధికి కేటాయించిన స్థలాన్ని కాపాడాలని అఖిలపక్ష నాయకులు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. విలువైన సీఎంసీ స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని వారి నుంచి స్థలాన్ని కాపాడాలని విన్నవించారు. అఖిలపక్ష నాయకులు గౌని ఐలయ్య, కంబాల ముసలయ్య, రెంటాల బుచ్చిరెడ్డి, ఏనుగుల ఐలయ్య, నంబూరి మధు, నాయిని శ్రీనివాసరెడ్డి, బందెల కళింగ రెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గూడూరు : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు తీగలవేణి జీపీ పరిధిలోని సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రణీత్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రెండు సబ్‌స్టేషన్‌ల పరిధిలో మేయింటినెన్స్ పనులు జరుగుతాయన్నారు.

చర్య తీసుకోవాలి

గూడూరు : మండల కేంద్రంలోని బ్రాహ్మణపల్లి పక్కన గల కోడి చెరువు శిఖం భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు జున్నూరు వెంకన్న, పానుగంటి నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు తోటకూరి సోమయ్య, బానోత్ రాజన్న, నూకల ఉపేందర్, ఇండ్ల హరీష్, వెంకటాచారి, సురేందర్, ఐలయ్య, సూరి, వెంకటయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

లక్ష్మాతండాలో సమస్యల తిష్ట

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


తండాలోని ప్రధాన రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మరిపెడ రూరల్ : అధ్వానంగా అంతర్గత రోడ్లు.. అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యంతో లక్ష్మా తండాలో సవాలక్ష సమస్యలు నెలకొన్నాయి.. ఊరికి దూరంగా ఉన్న గిరిజన తండాలను అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు.. కేవలం ఎన్నికలప్పుడు కనిపించిన నాయకులు ఇప్పుడు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.. దీంతో గిరిజన తండాలో సమస్యలు తిష్టవేశాయి.. మరిపెడ మండలంలోని లక్ష్మా తండా గ్రామ పంచాయతీ పరిధిలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గ్రామంలో పలు వీధుల్లో పారిశుద్ధ్యం లోపించి దుర్వాసన వెదజల్లుతోంది. అయినప్పటికీ పాలకులు, అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తండాలో ఇంకుడు గుంతలు, సైడ్ కాల్వలు లేక ఇండ్లల్లో నుంచి వచ్చిన మురుగునీరంతా వీధుల గుండా ప్రవహిస్తోంది. అదే విధంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్వాసన వస్తోందని తండావాసులు చెబుతున్నారు. దీంతో తండాలో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది పలువురు జ్వరాల బారిన పడుతున్నట్లు వారు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి గ్రామానికి రాకపోవడంతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతోనే లక్ష్మాతండా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అస్తవ్యస్తంగా ఉన్న అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. పార్లమెంట్, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చూపించిన ఉత్సాహం రాబోయే ఎన్నికల్లోను చూపాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, వైస్ ఎంపీపీ ఇట్టె శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతోష్, మేకల కుమార్, సర్పంచ్ మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఓబీ నిర్మాణం చేపట్టాలి



మహబూబాబాద్ రూరల్ : రైల్వే సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ సికింద్రాబాద్ రైల్ నిలయంలో శుక్రవారం రైల్వే శాఖ ముఖ్య అధికారులను కలిసి సమావేశమై చర్చించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏ క్యాబిన్ రైల్వే గేట్ ప్రాంతం మీదుగా నూతనంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. అలాగే ప్రయాణికుల అవసరాల మేరకు స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


గార్ల: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

మహబూబాబాద్ అర్బన్ : మానుకోట జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీని డీఈఓ పి.రామారావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జంజిరాల నాగరాజు, గుడిబోయిన గోపి కృష్ణ, రాగి సోమ నర్సయ్య చారి, వివిధ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్..

డోర్నకల్ : స్థానిక ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, ఎంఈఓ పూల్‌చంద్, హెచ్‌ఎంలు ఆంగోత్ లక్ష్మా, రుక్మేందర్‌రావు పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు వెంపటి సీతారాములు, డీఎస్ వినోద్‌కుమార్, రాష్ట్ర నాయకులు సీహెచ్ శ్రీధర్, కృష్ణారెడ్డి, ప్రభుదాస్, రమేష్, నాయకులు జె.కమల, నవీన్, అంజుమ్ సుల్తానా, అరుణాబాయి, శేషదీపిక తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ ఆధ్వర్యంలో..

కొత్తగూడ : పొగుళ్లపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్, డీటీఎఫ్ నాయకులు పొట్టయ్య, ప్రభాకర్, లక్ష్మయ్య, చంద్రయ్య, సుమన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

పెద్దవంగర : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను సంఘం జిల్లా కార్యదర్శి ఎర్ర వెంకన్న, నాయకుడు గుర్రం శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నోడల్ హెచ్‌ఎం శ్రీనివాస్‌తో కలసి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గార్లలో..

గార్ల : మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మాచర్ల సుందర్‌కుమార్, జి.భద్రు నాయక్, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, దనియాకుల రామారావు, సంఘం నాయకులు ఎండి అబ్దుల్ ఖదీర్, ఎస్‌కె షరీఫ్, వై ఎల్లయ్య, టి తులసీదాస్, జి వెంకట్రామ్,వి విజయ, బి పార్వతి, బాయమ్మ, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో..

న్యూడెమోక్రసీ పార్టీ 2024 సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు కొనకంచి నర్సయ్య ఆవిష్కరించారు. గార్ల మండల కార్యదర్శి జి.సక్రు, వీరభద్రం, మనోహర్, గణేష్, మంగీలాల్, మాన్యా, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలి

మహబూబాబాద్ అర్బన్ : గత ప్రభుత్వ నిరంకుశ వైఖరితో ఉద్యోగుల పాలిట శాపంగా మారిన 317 జీఓ పరిష్కారం కావాలంటే నూతన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ఉమ్మడి జిల్లాను జోన్‌గా ఏర్పాటు చేయాలి, లేదా పూర్తిగా రద్దు చేయాలని టీపీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

బయ్యారం : మండలంలోని ఇల్లందు–మహబూబాబాద్ ప్రధాన రహదారిపై గంధంపల్లి ఎస్‌బీఐ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. జగ్నాతండాకు చెందిన గుగులోత్ లచ్చు ద్విచక్ర వాహనంపై కొత్తపేట వైపు వెళ్తుండగా ఇల్లందు నుంచి మహబూబాబాద్ వస్తున్న లారీని అదుపుతప్పి ఎదురుగా ఢీకొట్టాడు. చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

గార్ల : మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ చిన్నా ద్విచక్రవాహనంపై అక్రమంగా 10 లీటర్ల నాటుసారాను విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు. ఈమేరకు సారాను స్వాధీనం చేసుకొని చిన్నాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గార్ల మండలంలోని చంద్రగిరి రోడ్డులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి రూ.2,420 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసుల దాడి చేయగా ఎ.శ్రీను, అనిల్, మనోజ్, శ్రీనివాస్ పట్టుబడగా, రవి, విజయ్, వెంకన్న పరారీలో ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ చోరీ.. కేసు నమోదు

దంతాలపల్లి : మండలకేంద్రానికి చెందిన దాసరి సాయికుమార్ తన బైక్‌ను ఇంటి ఎదుట పెట్టి పడుకున్నాడు. గురువారం లేచి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో స్నేహితులతో సాయికుమార్ గురువారం వెతికిన ప్రయోజనం లేకపోయే సరికి శుక్రవారం పోలీస్‌లను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్ : ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆత్మహత్యాయత్నానికి కారణం తెలియరాలేదు.

మద్యం మత్తులో హల్‌చల్

మహబూబాబాద్ రూరల్ : మానుకోట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మద్యం మత్తులో ఓ వ్యక్తి శుక్రవారం హల్‌చల్ చేశాడు. ఎవరి మాట వినకుండా సదరు వ్యక్తి మద్యం మత్తులో ఉండి బెంచీపై నిద్రిస్తూ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోనే మూత్ర విసర్జన చేశాడు. దీంతో ప్రయాణికులంతా భయభ్రాంతులకు గురయ్యారు. సిబ్బంది నిద్రలేపినా లేవక పోవడంతో కొంత సమయం తర్వాత అతన్ని బయటకు పంపించారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలోని మైనార్టీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహమ్మద్ జావిద్ పాష శుక్రవారం తెలిపారు. ఇంటర్‌లో ప్రవేశానికి పదో తరగతి చదువుతున్న వారు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టీఎమ్ఆర్ఎస్. తెలంగాణ.గౌట్. ఇన్ వెబ్‌సైట్‌లో నేటి నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

డోర్నకల్ : స్థానిక మైనార్టీ గురుకుల బాలికల కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరం ఇంటర్ ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజసుధ కోరారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఫిబ్రవరి 6 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

నిత్యావసరాల పంపిణీ

దంతాలపల్లి : మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన ఊడుగుల సంతోష్ రెండేళ్ల క్రితం బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. కాగా శుక్రవారం సంతోష్ జయంతి సందర్భంగా స్థానిక అమ్మ ఒడి అనాథాశ్రమంలో తల్లిదండ్రులు, స్నేహితులు కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు పాలు, పండ్లు, బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు ఐలయ్య, మంజుల, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల వితరణ

దంతాలపల్లి : మండలంలోని రేపోని గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి శైలజవెంకటరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అయోధ్య రాములోరి అక్షింతలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కంచర్ల యాకచారి, రాంరెడ్డి, పొద్దుటూరి సోమయ్య, మద్దెల సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీఏలు వెంటనే విడుదల చేయాలి

మహబూబాబాద్ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల మూడు డీఏలను తక్షణమే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు బి.హరి నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హరి నాయక్ హాజరై మాట్లాడారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

గార్ల : పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ గార్లలో చేపట్టిన భవన నిర్మాణ రంగ కార్మికుల సమ్మె శుక్రవారం ఆరో రోజుకు చేరుకుంది.

సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయాలి



కేసముద్రం : సేంద్రియ పద్ధతిలో పంటలను సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని తెలంగాణ రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ సాల్లేటి జైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు సంకు శ్రీపాల్‌రెడ్డి, పాదిల నర్సింహరెడ్డి, గండి శ్రీనివాస్, బండి వెంకన్న, కుమారస్వామి, ఇప్కో సంస్థ ప్రతినిధులు విశాల్, జీవన్, సీఈఓ సంతోష్, రైతులు పెరటి వెంకట్రామ్ నర్సయ్య, అకుల సుధాకర్, భిక్షం, నాగయ్య, వెంకన్న, సాయి పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కురవి : టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మహాసభ పోస్టర్లను కాంప్లెక్స్ హెచ్‌ఎం వాహిద్‌చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మంలో జరగబోయే మహాసభలను విజయవంతం చేసేందుకు సంఘం సభ్యులు కృషి చేయాలని పేర్కొన్నారు.

వాటర్‌బాటిళ్ల పంపిణీ

కేసముద్రం : మండలంలోని రంగాపురం యూపీఎస్‌లో వనపర్తి భవానీ జన్మదినం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు వాటర్‌బాటిళ్లను అందజేశారు. అలాగే మండల కేంద్రంలో బాదావత్ గణేష్ జయంతి సందర్భంగా పీడీఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, దుస్తులు, పండ్లను శుక్రవారం పంపిణీ చేశారు.

'అసత్య ప్రచారం మానుకోవాలి'

మహబూబాబాద్ రూరల్ : డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డికి, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ మధ్య వర్గ పోరు ఉందని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా చేసిన ప్రచారం అసత్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు లకావత్ రమేష్, గుగులోత్ మురళి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

22న పంచముఖ ఆంజనేయ విగ్రహావిష్కరణ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలో ఈనెల 22వ తేదీన 16 అడుగుల పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహావిష్కరణ ఉంటుందని అర్చకులు శుక్రవారం తెలిపారు.

తీర్థంకరుల ప్రాణప్రతిష్ఠ వేడుకలు షురూ



డోర్నకల్ : డోర్నకల్‌లో జైన మతస్తులు నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం 24 తీర్థంకరుల ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభమయ్యాయి. పాత ఆదినాథ్ భగవాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శని, ఆదివారాల్లో నూతన ఆలయంలో శోభాయాత్రలు, ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. అనంతరం 22వ తేదీన నూతన ఆలయంలో 24 తీర్థంకరుల ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నారు.

ధర్నాకు సహకరించాలి

నెల్లికుదురు : బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరగాని భిక్షపతి గౌడ్ కాంగ్రెస్ పార్టీని కోరారు. శుక్రవారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కలసి మాట్లాడారు.

అద్దంకి దయాకర్‌ను కలిసిన నాయకులు

నెల్లికుదురు : హైదరాబాద్ లోటస్ పాండ్‌లో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌ను బల్మూరి వెంకట్‌తో కలసి స్థానిక మండల మాల మహానాడు నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

21, 22 తేదీల్లో మండల స్థాయి షటిల్ పోటీలు

గార్ల : అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని పెద్దకిష్టాపురంలో ఈనెల 21, 22 తేదీల్లో మండల స్థాయి షటిల్ డబుల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు, వార్డు సభ్యుడు హరిప్రసాద్ శుక్రవారం తెలిపారు.

కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేదు

కురవి : కాంగ్రెస్ పార్టీతో జెరిపోతుల రంగన్నకు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ పార్టీ సీరోలు మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

- ఏపీడీఓ(డీఆర్‌డీఏ) శాంతకుమారి


కురవి: ప్రజావేదికలో మాట్లాడుతున్న ఏపీడీ

కురవి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించే పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఏపీడీఓ(డీఆర్‌డీఏ) శాంతకుమారి హెచ్చరించారు. మూడు రోజుల నుంచి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2020 సంవత్సరం నుంచి 2023 మార్చి వరకు రూ.20.50 కోట్ల నిధులతో పనులు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు సరస్వతి, ధన్‌సింగ్, అంబుడ్స్‌మన్ ఆదాం, ఎస్ఆర్పీ సురేందర్‌బాబు, డీవీసీ యాకూబ్, ఏపీఓ యాకాంబ్రం పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

నర్సింహులపేట : ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల రికార్డులను సామాజిక తనిఖీ బృందం శుక్రవారం పరిశీలించింది. 2021 అక్టోబర్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన రూ.7 కోట్ల పనులపై శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో తనిఖీ బృందం పరిశీలించింది. నేటినుంచి గ్రామాల్లో చేపట్టిన పనులను డీఆర్‌పీలు, సిబ్బంది తనిఖీ చేస్తారని ఎస్ఆర్పీ నర్సయ్య తెలిపారు. గ్రామాల్లో సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి


పనులు చేయిస్తున్న చైర్మన్, కమిషనర్, అధికారులు

మహబూబాబాద్ : పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రోడ్లపై చెత్త లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రం శివారులోని ఆర్వోబీపై 60 మంది పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. ఈసందర్భంగా చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నెలలో రెండు సార్లు బ్రిడ్జిపై పరిశుభ్రత పనులు చేపట్టాలన్నారు. నిత్యం పర్యవేక్షిస్తు రోడ్లపై చెత్త లేకుండా చూసుకోవాలన్నారు. పనుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాల్వలను శుభ్రం చేయడం, అన్ని పనులు సక్రమంగా ప్రతి రోజు పూర్తి చేయాలన్నారు. తనిఖీ చేస్తున్న క్రమంలో చెత్త చెదారం కాల్వల్లో ఉంటే సంబంధిత అధికారి, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ టి.ప్రసన్నరాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీహరి, రాజేష్, జవాన్లు శ్రీను, చిరంజీవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి

- ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె, బంద్
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్


మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్


మహబూబాబాద్ రూరల్ : బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాపిత సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మిక, కర్షక ఐక్యత సదస్సు ఆకుల రాజు, మండ రాజన్న అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా కార్మికులు, రైతులు, శ్రామికులు, ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కార్పొరేట్లకు దాసోహం చేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నల్లపు సుధాకర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

సదస్సును విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ తదితరులు

మహబూబాబాద్ అర్బన్ : రాష్ట్ర విభజన హామీలపై టీజేఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'విభజన హామీలు–కేంద్ర ప్రభుత్వ వివక్ష' అనే అంశం పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్రంలో విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో జరిగే రాష్ట్ర సదస్సుకు అధికసంఖ్యలో మానుకోట జిల్లా నుంచి టీజేఎస్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లి సుధాకర్, ఆరుద్ర పరమాత్మ చారి, గౌస్ పాషా, కృష్ణప్రసాద్, పాయి, రంజిత్, శంకర్, శేఖర్, రాజు, రవికుమార్, ప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ల ఆవిష్కరణ


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యాకాంతం

కేసముద్రం : మండలంలోని కల్వల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాకాంతంగౌడ్ మాట్లాడుతూ.. 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఈ నెల 22న పాఠశాల స్థాయిలో చెకుముకి పోటీ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. 27న మండల స్థాయి, ఫిబ్రవరి 3న జిల్లా స్థాయి, ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు రాష్ట్ర స్థాయిలో చెకుముకి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక బాధ్యులు యాదగిరి, చంద్రశేఖర్, నర్సింహరాజు, మోహనకృష్ణ, కూన శ్రీను, చీకటి వెంకట్రామనర్సయ్య పాల్గొన్నారు.